క్లుప్తంగా

ఎంపీడీఓగా ప్రతాప్‌రెడ్డి



బుచ్చినాయుడుకండ్రిగ: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ప్రతాప్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కేవీబీ పురం మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తూ ఎఫ్ఏసీ ఎంపీడీఓగా ప్రతాప్‌రెడ్డి బదిలీపై ఎన్నికల బదిలీ ప్రక్రియలో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న షాలెట్ నిమ్మనపల్లె ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. గతంలో వీడీఓగా ఇదే మండలంలోని పనిచేశానని, మండలాభివృద్ధికి కృషి చేస్తానని ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

20న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం మార్చి 20వ తేదీన లెక్కించనున్నట్లు ఈవో నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన హుండీలతోపాటు, పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను ఉదయం 7గంటల నుంచి లెక్కించనున్నట్లు చెప్పారు. ఆలయ ఉద్యోగులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

పోషణ కిట్లతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భవతులకు సీమంతాలు చేస్తున్న విజయ

ఏర్పేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో గర్భవతులు, పిల్లలు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్‌వాడీ కార్యకర్త విజయ అన్నారు. మండలంలోని మడిబాక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణులకు సీమంతాలు నిర్వహించి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. గర్భిణులకు ఆరోగ్యంపై పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఘనంగా సరస్వతీ పూజ



సరస్వతీదేవి పూజా కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో నెలవాయి జెడ్పీ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులు శుక్రవారం సరస్వతీ పూజ నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి, కొవ్వొత్తులతో ఓంకారం ముందు జ్యోతి వెలిగించారు. ఉపాధ్యాయుల నుంచి ఆశీస్సులు పొందారు. ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ మాట్లాడుతూ, మార్చి 18 నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని, ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు.

డిపో అభివృద్ధికి రూ.60 లక్షలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో అభివృద్ధికి రూ.60 లక్షలు నిధులు కేటాయించినట్లు ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి తెలిపారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఆర్టీసీ డిపోను పరిశీలించారు. ఆయనతోపాటు ఆర్టీసీ అధికారులు ఉన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

బుచ్చినాయుడుకండ్రిగ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధుల్లో అలసత్వం వహించరాదని తహసీల్దార్ పటాన్ మహ్మద్ అలీఖాన్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఎన్నికల కసరత్తు, ఓటర్ల జాబితాపై అధికారులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో గొడవలను సృష్టించే వారిని బైండోవర్ చేసుకోవాలని ఎస్ఐ వెంకట నరసింహానికి సూచించారు. ఇప్పటికే పలువురిని బైండోవర్ చేశామని, ఎన్నికల్లో గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా పక్కా ప్రణాళికతో ఉన్నట్టు ఎస్ఐ చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద నంబర్, నియోజకవర్గం నంబర్, ఈఆర్ఓ, ఆర్ఓ, ఏఈఆర్ఓ, బీఎల్ఓ, ఎస్‌హెచ్ఓల హోదా, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా రాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'సైనిక్'లో శ్రీకాళహస్తి విద్యార్థి ప్రతిభ



షేక్ అయాన్

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన షేక్‌అయాన్ సైనిక్–2024 ప్రవేశపరీక్షల్లో ప్రతిభచూపాడు. ఈ విద్యార్థి ఎస్వీ సైనిక్ అకాడమీలో శిక్షణ తీసుకున్నాడు. దేశ స్థాయిలో 377వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు, తిరుపతి జిల్లా స్థాయిలో 2వ ర్యాంకు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.

'ఫ్యాన్' స్పీడ్ పెంచుదాం

- ప్రతిపక్షాల తీరును ఎండగట్టండి
- ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్
- ప్రజల నుంచి విశేష స్పందన



కదూరులో సిమెంటు రోడ్డు ప్రారంభిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో మళ్లీ ఫ్యాన్ స్పీడ్ పెరిగి వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ సమన్వయ కృషి చేయాలని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ కోరారు. సత్యవేడు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. శుక్రవారం మండలంలోని కురింజల్లం, ఇందిరా నగర్, కాంబాకం, కదూరు, నెల్లటూరు, గూడలవారిపాళెం గ్రామ పంచాయతీల్లో రాజేష్ తన సతీమణి చైతన్య భానుతో కలసి జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని, ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరారు.

ఘన స్వాగతం

గ్రామాల్లో కర్పూర హారతులు డప్పులు, వాయిద్యాలతో రాజేష్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలతో పేద ప్రజలను ఆదుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని, మహిళలు, వృద్ధులు, గ్రామాల్లో చెబుతుండడంతో ప్రచారానికి విశేష స్పందన లభించింది.

సీసీ రోడ్డు ప్రారంభం

కదూరు దళితవాడలో కొత్తగా వేసిన సిమెంటు రోడ్డును స్థానిక ఎంపీటీసీ నందయ్య, సర్పంచ్ సుజాతతో కలసి రాజేష్ ప్రారంభించారు.



కదూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న నూకతోటి రాజేష్

ప్రతిపక్షాలను ఎండగట్టాలి

గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్యనేతలతో రాజేష్ మమేకమవుతూ దిశానిర్దేశం చేశారు. రానున్న 40రోజులు ఎంతో కీలకమని, ఈ సమయంలో ప్రతిఒక్కరూ ఐక్యతతో గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని, ప్రతిపక్షాల అబద్ధపు హామీలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సేవాదళ్ కన్వీనర్ నానిరెడ్డి, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టు బోర్డు సభ్యుడు పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, సోషల్ మీడియా నియోజకవర్గ కో–కన్వీనర్ శోభన్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, శివా యాదవ్, మహేంద్ర, శివారెడ్డి, నరేంద్ర, సుబ్రమణ్యం, ఉజ్వల్‌రెడ్డి, సర్పంచులు వీరభద్రం (ఇందిరానగర్), లక్ష్మమ్మ (కురింజల్లం), దీప (కాంబాకం), సుజాత (కదూరు), మునెమ్మ (నెల్లటూరు), చంద్రారెడ్డి (గూడలవారిపాళెం) పాల్గొన్నారు.

మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం





శ్రీకాళహస్తి, నాగలాపురంలలో సిద్ధం పోస్టర్లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాళహస్తి: మండలంలోని బూత్ కమిటీలతో పార్టీ కార్యాలయంలో నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కుమార్తె పవిత్రారెడ్డి హాజరయ్యారు. బూత్ కమిటీ కన్వీనర్లను ఉద్దేశించి పవిత్రారెడ్డి మాట్లాడారు. గతంలో టీడీపీ నాయకులు నీరు–చెట్టు, జన్మభూమి కమిటీల పేరుతో దోచుకుంటే, నేడు ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అవినీతికి తావు లేకుండా అందిస్తున్నామని చెప్పారు. 30 ఏళ్లుగా దోపిడీ చేస్తున్న టీడీపీ నాయకులు గ్రామాల్లో పెత్తందార్లుగా మారారని చెప్పారు. అలాంటివారిని ఎదిరించి ఎన్నికలకు వెళుతున్నామని చెప్పారు. పార్టీలో చిత్తశుద్ధితో పని చేసే వారికి పదవులు లభిస్తాయని చెప్పారు. నిబద్ధతతో ప్రతి ఒక్క బూత్‌కమిటీ ఇన్‌చార్జి కష్టపడి పని చేసే వాళ్లతో కలిసి ముందుకెళ్లాలన్నారు. ఎవరి ఒత్తిళ్లకు లొంగకుండా గతంలో కంటే మెరుగ్గా పనిచేసి జగనన్నను గెలిపించుకుందామన్నారు. ప్రజలందరూ సంక్షేమ ఫలాలు పొంది ఓట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారని వారిని బూత్‌ల వద్దకు తీసుకెళ్లి ఓట్లు వేయించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కరోనా కష్టకాలంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, జగనన్న సేవలు అందుకున్నారని గుర్తుచేశారు. కష్టకాలంలో అండగా ఉన్న ప్రభుత్వాన్ని ఎమ్మెల్యేను గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎన్నికల తరువాత గెలిచినా ఓడినా కనపడకుండా పోయేవారిని సాగనంపే సమయం ఆసన్నమైందని చెప్పారు. అనంతరం సిద్ధం కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ వెంకట నారాయణరెడ్డి, నాగూర్‌రెడ్డి, వయ్యాల కృష్ణారెడ్డి, సురేంద్రయాదవ్, బాలాజీరెడ్డి, భానుమూర్తి రెడ్డి, మనోహర్‌రెడ్డి, గోవిందరెడ్డి, అంకయ్య, వెంకటేశ్వర్లునాయుడు, మల్లి, గంగిరెడ్డి, మండల నాయకులు, బూత్‌కమిటీ ఇన్‌చార్జిలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం: మండలంలోని వేంబాక్కం, నందనం, సురుటుపల్లెలో శుక్రవారం పార్టీ మండల కన్వీనర్ అపరంజిరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్ ఆధ్వర్యంలో మేము సిద్ధం ..మా బూత్ సిద్ధం..కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బూత్ కన్వీనర్ల నేతృత్వంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకు గురించి ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మహేష్ రెడ్డి, నాగలాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ శ్యామ్, ఎంపీటిసి రాజ, నాయకులు దేశప్పన్, దేశన్, చిరంజీవి, ఏలుమలై, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల ఆగ్రహానికి ఆదిమూలం



వరదయ్యపాళెంలో నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

- సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ నాయకుల ఆగ్రహ జ్వాల
- ఆందోళన, నిరసనల హోరు
- ఆదిమూలం వెంట నడిచేది లేదని స్పష్టీకరణ
- అభ్యర్థిని మార్చాలని డిమాండ్

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోనేటి ఆదిమూలంను నియమించిన పార్టీ అధినేత చంద్రబాబు తీరుపై ఆ పార్టీ శ్రేణులు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఏకంగా రోడ్లపైకి వచ్చి ఆందోళన చేశాయి. సత్యవేడు నియోజకవర్గంలోని బస్టాండ్ ఆవరణలో శుక్రవారం బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెంకు చెందిన పలువురు నేతలు ఆందోళన, నిరసనతో తమ ఆగ్రహావేశాలను వెళ్లగక్కారు. కనీసం నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సంప్రదించకుండా అధిష్టానం ఆదిమూలాన్ని అభ్యర్థిగా ప్రకటించడం సరికాదని ఆక్షేపించారు. నియోజకవర్గంలో పలు ఆరోపణలు ఎదుర్కొంటూ టీడీపీ శ్రేణులను పలు ఇబ్బందులకు గురి చేసిన ఆయన వెంట తాము నడిచేది లేదని, మాజీ ఎమ్మెల్యే హేమలత, ఆమె తనయురాలు హెలన్, మాజీ ఎమ్మెల్యే ఆదిత్య, గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన జేడీ రాజశేఖర్ తదితర నాయకుల్లో ఎవరికిచ్చినా తాము పనిచేస్తామని విస్పష్టంగా ప్రకటించారు. అలాగే నూతన అభ్యర్థిని ప్రకటించినా తాము పనిచేస్తామన్నారు. అలాగే సాయంత్రం వరదయ్యపాళెం మండల టీడీపీ అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి ఇంటి వద్ద జరిగిన పార్టీ శ్రేణుల సమావేశంలో సైతం మెజారిటీ నాయకులు ముక్తకంఠంతో ఆదిమూలం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. ఆదిమూలాన్ని అభ్యర్థిగా కొనసాగిస్తే ఓటమి తప్పదని వారు హెచ్చరించారు.

సత్యవేడు టీడీపీకి బ్లాక్ డే

వైఎస్సార్‌సీపీలో పక్కన పెట్టిన ఆదిమూలాన్ని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం మా పార్టీకి బ్లాక్ డేగా భావిస్తున్నాం. దీనిపై అధిష్టానం పునఃసమీక్షించాలి. ఆదిమూలం నాయకత్వంలో పనిచేయలేం.

–భాస్కర్ యాదవ్, కార్యదర్శి
టీడీపీ తిరుపతి పార్లమెంట్ రైతు విభాగం

సిపాయి భరోసా పంపిణీ

ఏర్పేడు: రాజులపాలెం ఎస్సీ కాలనీలో ఇటీవల పి.ధనుంజయ(56), పంగూరు అరుంధతీవాడకు చెందిన కె.ధనుంజయులు (49) అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం శుక్రవారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, సిపాయి భరోసా కింద ఒక్కొక్క కుటుంబానికి 42 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు. సర్పంచ్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్లు వెంకటాద్రి, బాబు, దాము, వైఎస్సార్ సీపీ నాయకులు గోవిందరెడ్డి, శంకరయ్య, బాలాజీ, మూర్తి, నడిపయ్య పాల్గొన్నారు.



భరోసా అందజేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

అలరించిన నృత్య ప్రదర్శనలు

రేణిగుంట: శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన ధూర్జటి కళాప్రాంగణంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం రాత్రి ముగిశాయి. రాత్రి కర్నూలు జిల్లా నందికొట్కూర్ లిక్షితాశ్రీ నృత్య కళాశాల నరేష్ బృందం నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. మరికొన్ని నాట్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం ఆలయాధికారులు వారిని ఘనంగా సత్కరించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన ఎం.నిర్మల, కుమారుడు ఎం.నిహార్ రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావుకు అందజేశారు. దాతలకు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటీశుని చెంత వేద ఘోష



వేదాలు పఠిస్తున్న పండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదాలు ఘోషించాయి. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలకు చెందిన వేదపండితులకు సభ నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీశైలం, తిరుపతి, కాణిపాకం, పెనుగ్రంచిపోలు, విజయవాడ, అమరావతి, శ్రీకాళహస్తి ఆలయాలకు చెందిన పండితులు వేద పారాయణం చేశారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. నాలుగు వేదాలను పఠించారు. అనంతరం పండితులను చైర్మన్, ఈవో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సురక్ష పేదలకు ఓ వరం

నాగలాపురం: జగనన్న సురక్ష పేదలకు ఓ వరమని స్థానిక సర్పంచ్ చిన్నదొరై సుధా అన్నారు. నాగలాపురం సచివాలయం–2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు విజయ్ కుమార్, అరుణ్ కిశోర్, తిరుపతి రుయా ఆసుపత్రి నుంచి గైనకాలజిస్ట్, ఆర్థోపిడీషియన్, కంటి వైద్య నిపుణులు 350 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, ఉప సర్పంచ్ సునీత, ఎంపీడీఓ పీఎంకె బాబు, పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ, నాయకులు చిరంజీవి, దేశన్, కులశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకే భవనం ప్రారంభం

రేణిగుంట: తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి రైతు భరోసా కేంద్రం, చిన్నకనపర్తిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభించిన అనంతరం కేకును కత్తిరించి చిన్నారులకు పంచిపెట్టారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లేసి మరోసారి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, పీఏసీఎస్ చైర్మన్ మణినాయుడు, ఎంపీటీసీ గోన సుబ్రమణ్యం, ప్రకాష్, సుబ్రమణ్యం, అంజూరు కృష్ణమూర్తి, సురేష్, సుధాకర్‌నాయుడు, వెంకటరమణారెడ్డి, వీరాస్వామి, గంగాధరం, కోవి చంద్రయ్య నాయుడు, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.



ఆర్బీకే నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయం ప్రారంభిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సుమారు రూ.కోటి వ్యయంతో స్వర్ణముఖి కరకట్ట పక్కన నిర్మించారని ఎమ్మెల్యే సతీమణి శ్రీవాణిరెడ్డి అన్నారు. గ్రంథాలయాన్ని శుక్రవారం శ్రీవాణి రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో ఓ ఇరుకైన గదిలో గ్రంథాలయాన్ని నడపడం బాధాకరమన్నారు. గ్రంథాలయం ఎక్కడ ఉందో కూడా చాలా మందికి తెలియదని గుర్తుచేశారు. బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ప్రాధాన్యత తెలుసు కాబట్టే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు కావాల్సిన అన్ని రకాల స్టడీ మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అనంతరం జెడ్పీ బాలుర పాఠశాలలో 190 మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం తొట్టంబేడు మండలంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద పట్టాలు పంపిణీ చేశారు. బాబు అగ్రహారం పాఠశాల, సరస్వతీబాయి పాఠశాల, ఊరందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, భాస్కరపేట పురపాలకసంఘం పాఠశాలలో మొత్తం 325 మంది పదవ విద్యార్థులకు పరీక్ష కిట్లను ఎమ్మెల్యే కుమారుడు ఆకర్ష్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండలాధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మధురెడ్డి, మున్నా, ఆర్కాడు శంకర్, తలపా దామోదర్‌రెడ్డి, గెరాటా రెడ్డి, రవి గౌడ్, జయకృష్ణారెడ్డి, పసల కృష్ణయ్య, ఫజల్, రవి, సాగిరాబీ, ధనలక్ష్మి, శ్యామలమ్మ, ప్రమీల, సుమతి తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కిట్లను పంపిణీ చేసిన అనంతరం విద్యార్థులతో బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

ఊంజల్ సేవలో పద్మావతి



ఉయ్యాల సేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సుప్రభాత సేవతో తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను చేశారు. ఉదయం 7 గంటలకు వేంకటేశ్వరస్వామికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం నిత్యకైంకర్యాల అనంతరం తిరుచ్చి వాహనంపై పద్మావతీ అమ్మవారిని సుందరంగా అలంకరించి అధిష్ఠింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఉయ్యాల సేవలో సేదదీరారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఆర్జితం అధికారి భరత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి నరసింహులు

సత్యవేడు: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై ఎన్నికల సిబ్బంది పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సత్యవేడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నరసింహులు(స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏపీఐఐసీ తిరుపతి) అన్నారు. శుక్రవారం సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాలలో ఫ్లెయింగ్ స్క్వాడ్(ఎఫ్ఎస్), స్టాటిక్ సర్వేలెన్స్(ఎస్ఎస్టీ), వీడియో వీవింగ్ టీం(వీవీటీ), వీడియో సర్వేలెన్స్‌టీం(వీఎస్టీ), అకౌంటింగ్ టీం(ఏటీ), జిల్లా కంప్లైంట్ మానిటరింగ్ సెల్(డీసీఎంసీ) అధికారులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఆర్ఓ మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే ప్రతి అధికారి ఎన్నికల కమిషన్ పరిధిలోకి వస్తారని, అందరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల కమిషన్ హ్యాండ్ బుక్‌ను చదివి అవగాహన పెంచుకోవాలని చెప్పారు. శిక్షకులుగా ఎస్ ఈశ్వరయ్య, జీ. బాలకృష్ణ, భాస్కర్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఏఆర్ఓ కే. రామాంజనేయులు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి, తహసీల్దార్లు ఉదయభారతి, మహమ్మద్ అలీ, రవిశంకర్, శ్రీరాములు నాయక్, హుస్సేన్ సాహెబ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



కుప్పమ్మ(ఫైల్)

నారాయణవనం: పాముకాటుకు గురై చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం..స్థానిక కోట వీధిలో నివాసముంటున్న మరమ్మగ్గ కార్మికుడు అరుణాచలం భార్య కుప్పమ్మ(54) ఆదివారం సాయంత్రం కట్టె పుల్లల కోసం బైపాస్ రోడ్డులోని వెత్తలతడుకు సమీపంలోని మామిడి తోటకు వెళ్లింది. పుల్లలు తీసుకొని ఇంటికి వస్తుండగా పాము కాటుకు గురైంది. కుటుంబ సభ్యులు పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం చెన్నై జీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించి కుప్పమ్మ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

సత్యవేడు: ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని నాలుగు విడతల్లో మండలంలో 3,355 మంది మహిళలకు రూ.23. 31 కోట్లు విడుదల చేసి వారికి ఆర్థిక భరోసా కల్పించారని ఎంపీపీ ప్రతిమ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నాలుగో విడత ఆసరా మెగా చెక్కును లబ్ధిదారులకు ఆమె అందజేశారు. అలాగే లబ్ధిదారులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. మండలంలో మైనారిటీలు నలుగురు, బీసీలు 1720, ఎస్సీలు1412, ఎస్టీలు 219 మంది మహిళలు ఆసరా పథకంలో లబ్ధి పొందారని వివరించారు. చంద్రబాబు రుణమాఫీ చేయకుండా మహిళలను మోసం చేశారన్నారు. రాబోవు ఎన్నికల్లో మహిళలందరూ సీఎం జగన్‌ను ఆశీర్వదించి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎన్ చంద్రశేఖర్, ఏపీఎం స్వర్ణలత, సీసీ పయని, అకౌంటెంట్ నందిని, మండల సమాఖ్య అధ్యక్షురాలు మేఘల, కార్యదర్శి శకుంతల, కోశాధికారి కోటేశ్వరి, వీఓఏలు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్య పరిరక్షణ



వెల్‌నెస్ రన్ ప్రారంభిస్తున్న అధికారులు

రేణిగుంట: వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని హెచ్ఎస్‌సీ హెడ్ డాక్టర్ సురేష్ అన్నారు. మండలంలోని కరకంబాడిలో ఉన్న అమరరాజ బ్యాటరీస్ ప్రాంగణంలో శుక్రవారం వెల్‌నెస్ రన్ నిర్వహించారు. 'మా ఆరోగ్యం– మా బాధ్యత' అనే నినాదంతో ఆరోగ్య పరిరక్షణపై ఉద్యోగుల్లో అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉద్యోగులు పని ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం శారీరక దృఢత్వం పొందేందుకు వ్యాయామం తప్పనిసరి అన్నారు. సుమారు 500 మంది సిబ్బంది 3, 5 కిలోమీటర్ల రన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ ఏవీపీ శేఖర్, సీనియర్ జీఎం ఆండ్రూ జయకుమార్, హెచ్ఆర్ జీఎం నళినికుమార్, అమరరాజ ఇండస్ట్రియల్ సర్వీస్ జీఎం లోకరామానాయుడు, సునీల్ వర్మ, రవికుమార్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందిస్తున్న జువ్వల ధనంజయరెడ్డి

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో శ్రీసాయి గణేష్ విద్యాలయంలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పపిణీ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి అమ్మగుంట నాగరాజు వారి తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారు. పాఠశాల డైరెక్టర్లు జువ్వల ధనంజయరెడ్డి, చెంచురెడ్డి, కుమార్‌రాజు చేతుల మీదుగా విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. తొలుత వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య సరస్వతీపూజ నిర్వహించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం గత ఏడాది 10వ తరగతి ఫలితాల్లో స్కూల్ టాపర్‌గా నిలిచిన మల్లం భువనేశ్వర్‌రెడ్డికి రూ.15వేలు ప్రోత్సాహక నగదు పురస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.